# పోతనామాత్యుల శ్రీమద్భాగవతము

## ప్రహ్లాద చరిత్ర

సీ: తనయందు నఖిల భూతములందు నొకభంగి
సమహితత్వంబున జరుగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి
జేరి నమస్కృతుల్ సేయువాడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము సేసి మరలువాడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనుల గావ జింతించువాడు

సఖులయెడ సోదర స్థితి జరుపువాడు
దైవతములంచు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు
లలిత మర్యాదుడైన ప్రహ్లాదు డధిప

భావము ~ యుధిష్టురుడు చేస్తున్న రాజసూయ యాగానికి వచ్చిన నారదమహర్షి ధర్మనందనుడికి ప్రహ్లాద చరిత్రను చెబుతూ ~

రాజా! ప్రహ్లాదుడు సమస్త ప్రాణులు, తనవంటివేనని, వానియందు సమ సుహృద్భావాన్ని కలిగి ఉండేవాడు. పెద్దలెదురైనచో సేవకుని

వలె నమస్కరించు వినయశీలి; పరస్త్రీలు ఎదురైనచో మాతృభావముతో తొలగిపోవు శీలవంతుడు; దీనులను తల్లిదండ్రులవలె ధర్మవత్సలతతో ఆదరించువాడు; సాటివారిని సోదరభావముతో చూచు సహృదయుడు. గురువులను దైవసమానులుగా భావించువాడు; వినోదానికైనా అసత్యాలాడనివాడు; ఇటువంటి ఉత్తమ సత్వగుణ సంపనన్నుడీ ప్రహ్లాదుడు. అతడు సుందరాకారుడు, చక్రవర్తి తనయుడు, విద్యావంతుడును, శ్రేష్టుడునూ అయియున్నప్పటికినీ గర్వాహంకారములకు లోనుగానివాడు. సకల విషయ భోగభాగ్యముల మధ్య మసలుచున్ననూ, ఇంద్రియాల ప్రభావాలకు వశముకానట్టివాడు, యౌవన బలోపేతుడైననూ కామక్రోధాదులను దరిజేరనివ్వనివాడు.. స్త్రీ సంపర్కావకాశములు ఎంత సులభమైననూ వానియందు ఎటువంటి ఆపేక్ష చూపని వాడు; ప్రాపంచిక శబ్ధస్పర్శాది విషయాలందు ఎట్టి వాంఛలేనివాడు. ఇట్టి దైత్యకుమారుడు అన్యమేమీ ఎరుంగక శ్రీహరి చింతనామగ్నుడై ఉండేవాడు.

శా: పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాద పద్మ యుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మరచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా

భావము ~~

ఓ భూమీశా! ఆ ప్రహ్లాదుడు అన్నపానములు ఆరగించునప్పుడును, వినోదించునప్పుడును, నిద్రకుపక్రమించునపుడును, తిరుగుచున్నపుడును, చూచు చున్నపుడును, శ్రీహరియొక్క పాద పద్మాల చింతనామృతమును నిరంతరము గ్రోలుచున్నవాడై ఈ విశ్వాన్నే మరచిపోయేవాడు.

సీ: వైకుంఠ చింతా వివర్జిత చేష్టుడై యొక్కడు నేడుచు నొక్క చోట

నశ్రాంత హరి భావనారూఢ చిత్తుడై యుద్ధతుడై పాడు నొక్క చోట

విష్ణు డింతియ కాని వేరొండు లేదని యెత్తిలి నగుచుండు నొక్క చోట

నలినాక్షుడను నిధానముగంటినేనని యుబ్బి గంతులువైచు నొక్కచోట

బలుకు నొక్కచోట బరమేశు గేశవు ~ బ్రణయహర్ష జనిత బాష్ప సలిల

మిళితపులకుడై నిమీలితనేత్రుడై ~యొక్కచోట నిలిచి యూరకుండు

భావము

ప్రహ్లాదుడు విష్ణుమూర్తి చింతనలో మునిగి చేష్టలుడిగినవాడై, ఒక్కచోట

ఒక్కడూ కూర్చుని ఏడ్చేవాడు. నిర్విరామమైన శ్రీహరి చింతనతో నిండిన మనస్సుతో గొంతెత్తి గానము చేసేవాడు వేరొకచోట. అంతా విష్ణుమయమేగాని వేరేమియును లేదని నొక్కి వక్కాణించుచూ నవ్వేడి వాడొక చోట. పద్మాక్షుడనే
పెన్నిధిని కనుగొంటిని నేను ~ అని పొంగి గంతులు వేయుచూ మరొకచోట.
కేశవునితో స్వగతముగా మట్లాడును ఒకచోట. ప్రేమపూరిత భక్తి పారవశ్యములో మైమరచి ఆనంద బాష్పాలు రాల్చుచూ పులకిత శరీరుడై నిమీలిత నేత్రుడై నిల్చొని వుండే వాడు ఇంకొక చోట!

ప్రహ్లాదుడితో హిరణ్యకశిపుడు ఒకనాడు ~ వీడిని గురువులవద్దకు పంపి విద్యాభ్యాసము నందు పెట్టితే గానీ వాని స్థబ్ధత తొలగిపోదు అని తలచి శుక్రాచార్యుల పుత్రులైన చండామార్కుల వద్దకు పంపినాడు... ఆ తరువాత తిరిగి వస్తే తండ్రి ప్రహ్లాదునితో ~ నీవు గురువుల వద్ద ఏమేమి నేర్చుకున్నావో అని ప్రశ్నిస్తే ~ ప్రహ్లాదుడు ఇలా అన్నాడు. ~ ఓ దైత్యశ్రేష్టా! ఇల్లు అనే ఈ చీకటి నూతిలో పడి కొట్టుకినకుండా మీరు మేమి అనే భ్రమలోనూ భేదభావముతోనూ ప్రవృతించక సర్వముఇ ఆ శ్రీహరియొక్క దివ్యలీలామయమని అతనిని మనస్సులో నిలుపుకునుటే శ్రేష్టమైన

మార్గము  అని తెలుసుకున్నాను తండ్రీ! ~ అని బదులు చెప్పినాడు. దీనికి ఆ దానవుడేమన్నాడో

*తానేమి చదువుకుని నేర్చుకున్నానో ప్రహ్లాదుడు చెప్పగా హిరణ్యకశిపుడు శత్రు ప్రశంశను విని ఏమీ కోపగించక ~ ఇలా అన్నాడు:

శా: నాకుంజూడగ జోద్యమయ్యెడిగదా నా తండ్రి యీ బుద్ధి దా
నీకున్ లోపల దోచెనో పరులు దుర్నీతుల్ పఠంపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీ దానవ శ్రేణికిన్
పైకుంఠుండు కృతాపరాధు డతనిన్ వర్ణింప నీకేటికిన్

మ: సురలందోలుటయో సురాధిపతులన్ సుక్రించుటో సిద్ధులం
బరిపేధించుట యో ముని ప్రవరులన్ బాధించుటో యక్షకి
న్నర గంధర్వ విహంగనాపతులన్ నాశంబు నొందించుటో
హరి యంచున్ గిరి యంచు నేల చెడ మోహాంధుండవై పుత్రకా!

భావము

నాయనా ప్రహ్లాదా! నీ మాటలు నాకు మరీ విడ్డూరంగా ఉన్నాయి. ఈ బుద్ధి నీకే మనస్సులో దోచెనా లేక దుర్మార్గులైన పరులెవ్వరైనా భోదించినారా నీకు? లేదా నీ గురువులైన భార్గవులే నీకు

రహస్యముగా ఈ వక్ర బుద్ధిని నీకెక్కించినారా? ప్రహ్లాదా! నీకు తెలియదేమో వైకుంఠుడు మనపట్ల అపరాధము చేసినవాడు ~ అతణ్ణి వర్ణింప అవసరమేమున్నది నీకు? ప్రహ్లాదా మనకు కొన్ని కర్తవ్యాలున్నాయి ~ అవేమంటే ~ సురలను తరిమివేయుటయో~ లేక నలిపివేయుటయో ~ సిద్ధులను, మునిశ్రేష్టులను బాధించుటయో, యక్ష కిన్నెర గంధర్వ విహంగ నాగ శ్రేష్ఠులను నాశనము చేయుట ~ ఇలాంటి కార్యాలు చేయాలి గానీ హరి గిరి అనుకుంటూ మోహాంధుడవై చెడిపోరాదు సుమా! ~ అని హిరణ్యకశిపుడు అన్నాడు. దీనికి బాల ప్రహ్లాదుడేమన్నాడో చూద్దాము.

ఒక మనవి:

శ్రీమద్భాగవతము లోని పోతనామాత్యుని పద్యాలు తెలియని వారెవరూ ఉండరు ~ కానీ ఆ పద్యకుసుమాలను ఎన్ని మార్లు చదివినా మరీ మరీ చదవాలనిపిస్తుంది ~ ఆ పద్యాల మహిమ అలాంటిదో ఏమో మరి! భాగవతులకు వినిందే మరీ ఎందుకు వినాలనీ మరీ మరీ ఎందుకు చదవాలనీ అనిపిస్తే ~ నాకు తెలియజేస్తే ఈ శీర్షికను కొనసాగించకుండా మానివేస్తాననీ ఈ దాసుడు సవినయముగా మనవి చేస్తున్నాడు.

హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు చెప్పిన దాన్ని విని ఎందుకిలా మనవైరిని ప్రస్తుతిస్తున్నావని ప్రశ్నించగా బాలప్రహ్లాదుడు తన గురువర్యులను చూస్తూ ఇలా అన్నాడు:

సీ: మందారమకరంద మాధుర్యమున దేలి మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరకం బరుగునే సాంద్రనీహారములకు

తే: నంబుజోదర దివ్య పాదార వింద
చింతనామృత పాన విశేష మత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల?

(ఈ పద్యానికి తాత్పర్యమక్కరలేదనుకుంటాను.)

గురువర్యా! మందార పుష్ప తేనెల మాధుర్యములో తేలియాడే తేనెటీగ ఉమ్మెత్త చెట్ల చెంతకు పోతుందా? నిర్మల మందగమన గంగానదీ చిరు అలలపై తూగుచుండు రాజహంస వడివడిగా ప్రవహించు నదులవైపుకు వేళ్తుందా? లేలేత మామిడి చిగుళ్ళను ఆరగిస్తూ పరవశించే కోయిల కొండమల్లె తుప్పలవైపు వెళ్తుందా? నిండు పున్నమి వెన్నెలలో పరవశించి విహరించే చకోరపక్షి దట్టమైన పొగమంచులో ప్రవేశిస్తుందా? లేదు అట్లు చేయలేవు కదా! ఆ

విధంగానే  పద్మనాభుని దివ్యపాదపద్మ ధ్యానామృతమును గ్రోలి మత్తెక్కిన నా చిత్తమెట్లు ఇతర విషయాలపైకి పోగలదు? అది అసంభవము కనుక ఓ సుగుణశీలశ్రేష్టా! ఈ విషయముపై ఇంక వెయ్యి మాటలు ఎందుకు? అని అన్నాడు. అప్పుడు గురువులు ~ మేము నీకు నేర్పిన పలు శాస్త్రములలోనివి ఒకించుకైనా చెప్పకుండా నీవు శత్రుప్రశంశలు చేస్తున్న నీవు వంశదూషణుడవు. అని అంటూ దానవేంద్రునితో మరలా ప్రహ్లాదుని మేము తీసుకునిపోయి బాగా చదువులు నేర్పిస్తాము~ మాకు మరొక్క అవకాశమివ్వండి అని ఆ బాలప్రహ్లాదుని వారి గురుకులానికి  పిలుచుకుని వెళ్ళినారు.

అలా గురువులు ప్రహ్లాదుని పిలుచుకుని వెళ్ళి కొన్ని శాస్త్రాలను నేర్పి, ఇంక పరవాలేదు ~ సామ దాన భేధ దండోపాయములన్నిటినీ అవగాహన చేసుకున్నాడని తలంచి, దానవేంద్రుని వద్దకు పిలుచుకుపోయి ~ ఇప్పుడు నీ
కుమారుని ప్రజ్ఞాపాటవాలను పరీక్షించమని చెప్పగా ~ హిరణ్యకశిపుడు తన  కుమారుడిని తన ఒడిలో కూర్చోపెట్టుకుని ~~

శా: చోద్యంబయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో గురుబు లేవెంటం  బఠింపిచిరో
విద్యాసార మెరుంగ గోరెద భవద్విజ్ఞాత శాస్త్రంబులో
బద్యంబొక్కటి సెప్పి సార్థముగ దాత్పర్యంబు భాషింపుమా

నాన్నా! నీకు గురువులేయే అంశాలను నేర్పించిరో ~ నీవు నేర్చుకున్న వాటిలోఒక పద్యాన్ని చెప్పి దాని తాత్పర్యాన్ని చెప్పుమా? అని అడిగినాడు.

బాలప్రహ్లాదుడు ఇలా బదులు చెప్పినాడు~~

కచదివించిరి నను గురువులు ~ చదివితి ధర్మార్థముఖర శాస్త్రంబులు నే*

జదివినవి గలవు పెక్కులు ~ చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!

సీ: కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ

సుర రక్షకునిజూచు చూడ్కులుచూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము

విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరి దవిలిన మనము మనము

భవవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

తే: దేవదేవుని జింతించు దినము దినము

_చక్రహస్తుని బ్రకటించు చదుబు చదువు
_కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
_దండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి

తండ్రీ! గురువులు నన్ను చక్కగా చదివించినారు. నేను చదివినవి అనేకములు, చదువులలో సారమంతా చదివినాను. ఇంకా చెబుతూ ~ తండ్రీ! శ్రీహరిని పూజించే చేతులే చేతులు ~ శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుక ~ శ్రీపతిని చూచే చూపులే చూపులు ~ శేషశాయికి మ్రొక్కే శిరస్సే శిరస్సు ~ విష్ణుకథలను వినే చెవులే చెవులు ~ మధుసూధనుని తలంచే మనస్సే మనస్సు ~ భగవంతునికి ప్రదక్షిణలు చేసే పాదాలే పాదాలు ~ పురుషోత్తమునియందు నిలిచే బుద్ధియే బుద్ధి ~ దేవదేవుని గురించి ఆలోచించే దినమే దినము ~ చక్రధారిని గురించి తెలియజేసే చదువే చదువు ~ గోవిందుని గురించి భోధించే గురువే గురువు ~ శ్రీహరినే చేరవలెనని చెప్పే తండ్రియే తండ్రి సుమా! ఎందుకంటావా దానవేంద్రా!

సీ: కంజాక్షునకు గాని కాయంబు కాయమే? పవనగుంభిత చర్మభస్త్రిగాక

వైకుంఠుబొగడని వక్త్రంబు వక్త్రమే? ఢమఢమ ధ్వని తోడి ఢక్క గాక

హరిపూజనము లేని హస్తంబు హస్తమే? తరుశాఖ నిర్మిత దర్విగాక

కమలేశు జూడని కన్నులు కన్నులే? తనుకుడ్యజాల రంధ్రములు గాక

ఆ: చక్రి చింతలేని జన్మంబు జన్మమే?

తరళ సలిల బుద్బుదంబు గాక

విష్ణుభక్తిలేని విభుధుండు విభుధుడే?

పాదయుగము తోడి పశువు గాక

శ్రీహరికి అంకితముకాని శరీరము కేవలము గాలితో నిండిన కొలిమితిత్తిగాని, శరీరమవుతుందా? వైకుంఠుని స్తుతింపని నోరు కేవలము డమ డమ ధ్వనిచేసే ఢక్కగాని, నోరు అవుతుందా? హరిపూజ చెయ్యని చెయ్యి కేవలము కర్రతో చేయబడిన తెడ్డుగాని చెయ్యి అవుతుందా? కమలేశుని జూడని కళ్ళు కేవలము శరీరమనే గోడలోనున్న రంధ్రములే గాని కళ్ళవుతాయా? చక్రధారిని గురుంచి ఆలోచింపని జన్మ కదులుచున్న నీటిలోని బుడగ గాని జన్మ అవుతుందా? విష్ణు భక్తి లేని పండితుడు కేవలము రెండు కాళ్ళున్న పశువే కానీ పండితుడగునా?

ఇంకా బాలప్రహ్లాదుడు చెబుతూ

ప్రహ్లాదుడు ఇంకా ఏమన్నాడంటే ~

సీ: సంసార జీమూత సంఘంబు విచ్చునే చక్రి దాస్య ప్రభంజనము లేక

తాపత్రయభీల దావాగ్నులారునే విష్ణుసేవామృతవృష్టి లేక

సర్వకషాఘౌఘజల రాసులింకునే హరిమనీషా బడబాగ్ని లేక

ఘన విపద్గాఢాంధ కారంబు లడుగునే పద్మాక్ష నుతి రవి ప్రభలు లేక

తే: నితుపమాన పునరావృత్తి నిష్కళంక
ముక్తి నిధి గానవచ్చునే ముఖ్యమైన
శారంగ కోదండ చింతంనాంజనము లేక
తామరస గర్భునకునైన దానవేంద్రా!

సంసారమనే కారుమేఘ సమూహములు చక్రధరుని సేవలనే పెనుగాలులు వీచకుండా తొలగిపోవునా? తాపత్రయములనబడే దావాగ్నులు విష్ణుసేవామృత వర్షధారలు కురియకుండా చల్లారునా? అంతటా నిండియున్న పాపపు జలరాసులు హరిచింతన అనే బడబాగ్ని లేనిదే ఇంకిపోవునా? ఘోరవిపత్తులనే గాఢాంధకారములు కేశవుని కీర్తనలనబడే సూర్యకిరణములు లేనిదే మాయమవునా? నిరుపమానమైన పునర్జన్మలేని నిష్కళంకమైన ముక్తినిధిని కనుగొనుటకు విష్ణుచింతనమనే అంజనము లేనిదే ఆ బ్రహ్మ దేవుని

కై నా శక్యమవునా? ఆ శ్రీహరి యందు నిర్మల నిరుపమాన భక్తిలేనిదే యీ సంసార బంధము వీడదు, మోక్షము సిద్ధింపదు దానవేంద్రా!

ప్రహ్లాదుడు విష్ణువును ఎంతగానో కీర్తిస్తూ ఉంటే దానవేంద్రునికి చాలా కోపమొచ్చి ఇలా అన్నాడు:

క: బలవంతుడ నే జగముల
బలములతో జనక వీర భావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకు బ్రతివీరుడవై

ఈ మూడు జగాలలోనూ బలవంతుడను నేనే ~ ఎలాంటి సైనిక సహాయమును తోడు తీసుకుని పోకుండా నేనొక్కడినే మహావీరుడనై గొప్ప గొప్ప బలవంతులను జయించినాను. నీవు ఎవ్వడి బల సహాయముతో నన్ను ఎదిరించుచుంటివిరా మూర్ఖుడా! అని దానవేంద్రుడడిగితే ప్రహ్లాదుడు శాంతముతో ఇలా బదులిచ్చాడు.

క: బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్

బల మెవ్వడు ప్రాణులకును
బల_మెవ్వం డట్టి విభుడు బలమసురేంద్రా!

క: దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండు గలుగు దిక్కుల మొదలై
దిక్కు గల లేని వారికి
దిక్కయ్యెడు వాడు నాకు దిక్కు మహాత్మా!

భావము ~~ లోకములలోని బలవంతులకు ~ బలహీనులకు ఎవ్వడు బలమో, నీకును నాకునూ బ్రహ్మాది దేవతలకును ఎవ్వడు బలమో, సమస్త ప్రాణులకు ఎవ్వడు బలమో ఆ ఈశ్వరుడే నాకునూ బలము సుమా దానవేంద్రా! దిక్కులు, కాలము లేనివాడు, ఏ దిక్కులోనే ఉండనివాడు, దిక్కులకు మూలమైనవాడు, దిక్కుగలవారికి దిక్కు లేని వారికి దిక్కు ఏదియో అదియే నాకు దిక్కు సుమా తండ్రీ! సర్వవ్యాపకుడైన ఆ ప్రభువు తన వినోదము కొరకై అఖిల జగాలనూ సృష్టించి రక్షించి లయింపజేయును. ఆ నాశము లేనివాడు అన్ని రూపాలందునూ ఉన్నాడు. సమత్వములేని చిత్తమే మన శత్రువుగా ప్రవర్తించును. ఆ చిత్తాన్ని వశము చేసుకొని నీవు అహంభావముతో కూడిన అసురత్వమును వీడుమయ్యా తండ్రీ! నీ ఆశ్రితజనులు నీకు శ్రేయస్కరమైన మాటలు నీకు చెప్పరయ్యా!

ఉ: లోకములన్నియున్ గడియలోన జయించిన వాడ వింద్రియా
నీకము జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధు జేయు నీ
భీకర శత్రు లార్వ్వర బ్రభిన్నుల జేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లే డొకడు నేర్పున జూడుము దానవేశ్వరా!

తండ్రీ! నీవు అన్ని లోకాలనూ గడియలోనే జయించిన పరాక్రమశాలివి అయిననూ నీవు నీ ఇంద్రియాలను చిత్తమును జయింపలేక ఉన్నావు. నీలోనే
ఉన్న నిన్ను ధృఢముగా బంధించియుంచిన ఆరుగురు భయంకరమైన శత్రువులున్నారు (కామ క్రోధ లోభ మోహ మద మాశ్చర్యములనబడేవారు).
వారిని తొలగించినచో ప్రాణికోటిలో నీకొక్కడునూ విరోధి ఉండడు. వివేకముతో
ఈ విషయాన్ని గ్రహించవా తండ్రీ!

అని బాల ప్రహ్లాదుడు తండ్రికి బదులు చెప్పినాడు

ప్రహ్లాదుడు తన తండ్రితో శ్రీహరే నాకు నీకూ దిక్కు అని మరీ మరీ చెబుతుండగా, దానవునికి కోపమొచ్చి ~~

శా: నా తోడం బ్రతిభాషలాడెదు జగన్నాథుండు నా కంటే నీ

భూతశ్రేణికి రాజు లే డొకడు సంపూర్ణ ప్రభావుండు మ

ద్భ్రాతం జంపిన మున్ను నే వెదకితిం బల్మారు నారాయణుం

డే తద్విశ్వములోన లేడు మరి వాడెందుండురా దుర్మతీ

ఓరీ దుర్మతీ! నాతో వ్యర్థప్రలాపనలతో వాదిస్తుంటివి గానీ, నా వంటి సంపూర్ణ శక్తి సంపన్నుడు, జగన్నాథుడు అయిన రాజు ఈ జీవకోటికి ఇంకెవడున్నాడురా? పూర్వము నా సోదరుని జంపిన ఆ హరిని రూపుమాపుటకు నేను ఈ విశ్వమంతటనూ పలుమార్లు గాలించినాను ~ కానీ నాకు వడెచ్చటనూ కనపడలేదురా! వాడెచ్చట ఉంటాడో చెప్పరా? వాని సేవకునివలె చాలా ప్రేలాపన చేస్తూ ఉన్నావు ~ వాణ్ణి, నిన్ను ముక్కలు ముక్కలుగా ఖండిస్తాను ~ అని గర్జించినాడు.

దీనికి ప్రహ్లాదుడు చెప్పిన ఈ పద్యాలు మనకందరికీ తెలుసు ~ అయినా మరొక్కసారి ~~

మ: కల డంభోధి గలండు గాలి గల డాకాశంబునం గుంభినిం

గల డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం

గల డోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులందంతటం

గల డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల నీ యా యెడన్

క: ఇందుగలడందు లేడని ~ సందేహము వలదు చక్రి సర్వోపగతుం

డెందెందు వెదకి చూచిన ~ నందందే గలడు దానవాగ్రణి! వింటే

మ: హరి సర్వాకృతులం గలం డనుచు బ్రహ్లాదుండు భాషింప స
త్వరుడై యెందును లేడు లేడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుడు నా నా జంగమస్థావరో
త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్దండ ప్రభావంబునన్

భావము ~

తండ్రీ! ఆ హరి సముద్రములో ఉన్నాడు ~ గాలిలో ఉన్నాడు ~ ఆకాశములో ఉన్నాడు ~ భూమియందున్నాడు ~ అగ్నిలో ఉన్నాడు ~ అన్ని దిశలలో ఉన్నాడు ~ పగటిలోనూ రాత్రి యందునూ ఉన్నాడు ~ సూర్య చంద్రులందున్నాడు ~ త్రిమూర్తులందున్నాడు ~ స్త్రీ పురుష లింగములలోనూ ఉన్నాడు. ~ అంతటా ఉన్నాడు తండ్రీ ~ ఇక్కడ అక్కడ అని వెదకనేల? ఇంకా చెప్పాలంటే ఆ హరి ఇక్కడుండడు అక్కడ ఉండడు అను సందేహాన్ని ఉంచుకొనరాదు. విష్ణుమూర్తి అంతటా ఉన్నాడు. ఎక్కడెక్కడ వెదకి చూచిన, అక్కడక్కడనే చూడవచ్చునని తెలుసుకో దానవశ్రేష్టా!

ఇలా ప్రహ్లాదుడు బదులు చెబుతూ ఉంటే ~ హిరణ్యకశిపుడు లేడు లేడురా అని గర్జించుచుండగా, మహావిష్ణువు

శ్రీనరసింహాకారమును దాల్చి సమస్త చరాచర జీవ వస్తు జాలములలో అన్ని ప్రదేశములలో భీకర తేజోమయుడై వ్యాపించి ప్రత్యక్షమయ్యేందుకు సిద్ధముగా ఉండెను.

శ్రీహరి అంతటా ఉన్నదని తండ్రికి చెప్పగా హిరణ్యకశిపుడు గర్జించుచూ

క: డింభక సర్వ స్థలముల ~ నంభోరుహనేత్రుడుండు ననుచు మిగుల సం
రంభంబున బలికెద వీ ~ స్థంభంబున జూప గలవె చక్రిన్ గిక్రిన్

క: స్థంభమున జూపవేనిం ~ గుంభిని నీ శిరము ద్రుంచి కూర్పగ రక్షా
రంభమున వచ్చి హరి వి ~ స్రంభంబున నడ్డపడగ శక్తుండగునే

ఓరీ డింభకా! ఆ హరి అన్ని స్థలములందు ఉండునని ఎంతో సందడిగా చెప్పుకొనుచుంటివికదా! నీ చక్తిని గిక్రిని ఈ స్థంభములో చూపగలవేని చూపుతావా? నీవు అట్లు చూపలేనిచో నీ శిరము ద్రుంచి నేలగూల్చెదను ~ అప్పుడా హరి నీ యందు ప్రీతితో నిన్ను ఎట్లు రక్షింపగలుగునో చూస్తాను ~ అని అంటే ప్రహ్లాదుడు ~~

శా: అంభోజాసని డాదిగాగ దృణపర్యంతంబు విశ్వాత్ముడై
సంభావంబున నుండు ప్రోఢ విపుల సంభంబునందుండడే
స్తంభాంతర్గతుడయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని

ర్దంభత్వంబున నేడు గానబడు బ్రత్యక్ష స్వరూపంబునన్

తండ్రీ! పద్మాసనుడైన బ్రహ్మ నుండీ గడ్డిపరక వరకీ విశ్వమంతా తానేయై వ్యాపించి ఉన్న ఆ సర్వేశ్వరుడు ఇంత పెద్ద స్థంభములో ఉండకుండునా? ఈస్థంభములో కూడా ఉన్నాడనుటకు ఎట్టి సందేహమూ లేదు. దంభములేకుండ చూచిన, ప్రత్యక్ష రూపమున ఇక్కడే ఇప్పుడే దర్శింపవచ్చును. అని ప్రహ్లాదుడంటే,
ఆ దానవేంద్రుడు ~

మ: వినరా డింభక! మూఢచిత్తగరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెదవైన నిందు గలడే యంచు. మదోద్రేకియై
దనుకేంద్రుం డరచేత వ్రేసెను మహోదగ్ర ప్రభాశుంభమున్
జనదృగ్భీషణ దంభమున్ హరి జనుస్సంరంభమున్ స్థంభమున్

వినరా డింభకా! మూఢుడా! విష్ణువు విశ్వాత్మకుడని గొప్పగా వదరుచున్నావు ~ నీ మాటే నిజమైనచో వాడు ఈ స్థంభమునందుండునేమో చూపురా ~ అని మదోన్మత్తుడై ఉద్రేకమున ఆ దానవ చక్రవర్తి ఉగ్రతేజస్సుతో అత్యంత దంభాన్ని ప్రదర్శించుచూ హరి భక్తునకు (ప్రహ్లాదునకు) మిక్కిలి ఆనందము కలుగునట్లుగ తన అరచేతితో ఆ స్థంభమున కొక్క వేటు వేసాడు.

శ్రీ నారసింహ ఆవిర్భావము

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని దిఃఖరించి రత్నఖచిత స్వర్ణ కంకణ భూషితమైన హస్తముతో సభా మండప స్థంబముపై ఒక్క వేటు వేయగా, ఆ స్థంబము చిట్లి పెటిలి చట చట ధ్వనులతో విస్ఫులింగముల విరజిల్లుతూ విరిగిపడింది ~ భయంకరమైన ధ్వనులు ఆకశమంతా ఆవరించినాయి.. ఆ స్థంబము నుండీ ఆవిర్భవించిన మూర్తి ఎలా ఉండెనో పోతన చాలా బాగా వర్ణించినాడు.

చక్రము ~ ధనుస్సు ~ హలము ~ అంకుశము ~ మొదలైన దివ్య చిహ్నములు గల పాదపద్మములతో ~ ఐరావతముయొక్క కాళ్ళవంటి తొడలతోనూ ~ మణిమయ చిరుగంటల మొలత్రాడుచే చుట్టబడి ~ పీతాంబరము కట్టబడి శోభించు కటి తలముతో ~ పిడికిటిపాటిదైన సన్నని నడుముతో ~ విశాల వక్షస్థలముతో ~ వజ్రాయుధములవంటి నఖములతో ~ శంఖచక్రగదాది ఆయుధములు ధరించిన హస్తములతో ~ మణిమయ రత్నఖచిత మంజుల హార కేయూర కంకణ కిరీట మకర కుండలాది భూషణములతో ~ పర్వతమువంటి స్థిరమైన కంఠముతో ~ పారిజాత పుష్పము వంటి మనోహరమైన పెదవులతో ~ విద్యుల్లతవలె మెరయు దంతములతో ~ ప్రళయకాలమందు సకలభువనములను నశింపజేయు అగ్నిజ్వాలలవంటి ఎర్రని నాలుకతో ~ సూర్యగోళములవంటి నేత్రాలతో ~ తారకాగ్రహ సంయుత

అంతరిక్షమువంటి భృకుటితో ~ కమనీయమైన గండభాగముతో ~ భీతి పుట్టించు జూలుతో ~ లోకాలను భయకంపితము చేయు గర్జనలతో ~ ప్రకాశించు ధవళదేహముతో ~ ప్రహ్లాదుని రక్షించునట్టి కరుణారస దృక్కులతో ~ హిరణ్యకశిపుని సంహరించు వీరరసముతో ~ శ్రీనరసింహ భగవానుడు ఆవిర్భవించినాడు. అటువంటి అధ్భుత రూపాన్ని చూచిన హిరణ్యకశిపుడు

క: నరమూర్తి గాదు కేవల ~ హరిమూర్తియు గాదు మానవాకారము గే
సరియాకారము నున్నది ~ హరి మాయా రచిత మగు యథార్ధముచూడన్

ఇది నరరూపము కాదు ~ సింహరూపము కాదు ~ యథార్థముగా చూడగా రెండునూ కలిసి ఉన్న మాయావి హరి రూపముగా తోచుచున్నది.

ఉ: తెంపున బాలుడాడిన సుధీరత సర్వ గతత్వముం బ్రతి
ష్ఠింప దలంచి యిందు నరసింహ శరీరము దాల్చి చక్రి శి
క్షింపగ వచ్చినాడు హరిచే మృతి యంచు దలంతునన్నై నా
సొంపును బెంపు నందరును జూడ జరింతు హరింతు శత్రువున్

సాహసముతో బాలుడు తెగించి చెప్పిన మాటను నిలిపి తనయొక్క సర్వ వ్యాపకత్వమును నిరూపించుటకు ఆ విష్ణువే ఈ స్థంభమున నరసింహ రూపమును దాల్చి నన్ను శిక్షించుటకు వచ్చినాడా ~ ఈ హరిచేతనే నా మృతి సంభవింపనున్నట్లు అనిపించుచ్చున్నది. ఐనా అందరు చూచుచుండగా నాయొక్క బలపరాక్రమ శోభలను ప్రదర్శించి ఈ శతృవును హతమార్చుతాను... అని అహంకారముతో బిర్రబిగుకొని గదను ధరించి వేగిరపాటుచే నొగర్చుకొనుచు సింహమును సమీపించు మత్త గజమువలె రాక్షసవీరుడు నరసింహదేవునికి ఎదురుగా నడచి ఆయన యొక్క దివ్యతేజోజ్వాలలకు దావాగ్ని యందు ప్రవేశించిన మిణుగురు పురుగువలె కర్తవ్యాకర్తవ్యములు తెలియని మూఢుడివలె తేజోవిహీనుడై చేరి తన గదను గిరగిరా త్రిప్పి ఆ నరసింహమూర్తిని కొట్టగా ~ ఆ స్వామివారు సర్పమును ఒడిసి పట్టిన గరుడునివలె హిరణ్యకశిపుని పట్టుకొనగ, అతడు గిల గిలా కొట్టుకొని తన బలమంతా ప్రయోగించి పట్టు తప్పించుకొని ఎగిరి గంతువేసి తన శక్తివలన నరసింహుడు బలహీనుడయ్యెనని భావించి మిట్టిపడుచు, ఖడ్గ కవచముల ధరించి భయంకరముగా గంతులు వేయుచూ ఇటు నటు దర్పముతో కదను త్రొక్కుచుండగా

సీ: పంచాననోద్భూత పావక జ్వాలలు భూనభోంతరమెల్ల బూరితముగ

దంష్ట్రాంకు రాభీలధగ ధగాయిరదీప్తి నసురేంద్రు నేత్రము లంధములుగ

గంటకసన్ని భోత్కట కేసరాహతి నభ్రసంఘము భిన్నమై చలింప

బ్రళయాభ్రచంచలా ప్రతిమ భాస్వరములై ఖర నఖ రోచులు గ్రమ్మ్కదేర

తే: సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుడా దితిపట్టి నధిప

భీషణ అగ్ని జ్వాలలు ఆ స్వామినుండీ వెలువడి భూమ్యాకాశములను నింపివేసెను. జూలి విదిలించి గర్జించి విజృంభించి దృష్టిని అదురునిపై సారించి బొమలు ముకులించి జిహ్వాయాడించి నరసింహస్వాంక్ అసుఘునిపై లంఘించి వాని నొడిసి పట్టుకొనెను. పామునోటబడి కొట్టుకొను మూషికమివలె ఆ దనునుజుడు ప్రాణభయముతో కొట్టుకొని ఆ ఉగ్రనరసింహునికి అసురాధిపతి
లోబడిపోయెను. అప్పుడు వాడిని పట్టి తన తొడలపై నిడుకొని తన వాడియైన
నఖములతో గరుడుడు సర్పమును చీల్చ్చునట్లు ఆ దానవుని చీల్చివేసి

వాడు హృదయకమలమును చించి వేసి భూమిపై అతని రక్తాన్ని వర్షింపజేసి

రక్తనాళాలను త్రెంచివేసెను. విశాల వక్షమును బ్రద్దలు చేసు మాంసమును ముక్కలు ముక్కలుగా త్రుంచినారు. వాడి ప్రేవులను తన నఖాలతో కంఠమాలికలుగా చేసెను. అలా మానవరూపముగానీ మృగరూపముని గానీ కాకుండా నరసింహరూపాన రాత్రిగానీ పగలు గానీ కాకుండా సంధ్యా సమయమున బయట గానీ లోపలగాంకి కాని ద్వారస్థలముననను భూమిఆకాశములుకాని తన యూరువులపైన సజీవమి గాని నిర్జీవము గాని కాని తన నఖాలతో ఆ దానవుణ్ణి వధించి గర్జించు చున్న స్వామిని చూచి రాజభృత్యులు మీదికి ఉరకగా వారినందరినీ ~ ఒక్కడుకూడా మిగులకుండా తన చక్రాయుధముతో సంహరించెను.

అప్పుడు శివుడు ఇంద్రాది దేవతలు వచ్చి స్వామిని శాంతించమని ప్రార్థించినారు. స్వామి శాంతింపకపోతే వారంతా లక్ష్మీ దేవిని వేడుకున్నారు.

క: హరికిం బట్టలుదేవివి ~ హరిసేవా నిపుణమతివి సదా

హరిరతివి నీవు సని నర ~ హరి రోషము డింపవమ్మ హరివరమధ్యా

తల్లీ ~ శ్రీహరికి పట్టలుదేవివి ~ హరి సేవచేయుటలో నిపుణురాలివి ~ హరిని ఎల్లపుడూ కోరబడుదేవివి ~ ఎల్లపుడూ హరిని రమింపజేయు సతివి ~ నీవు పోయి ఆ నరహరి రోషాన్ని శాంతింపజేయుమమ్మా అని వేడుకున్నారు.

*భ్రహ్మాది దేవతలు లక్ష్మీదేవిని వేడుకోగా ~ ఆమె కూడా స్వామి ఉగ్రరూపాన్ని చూచి కాస్త జంకుతుండగా, బ్రహ్మ స్వామి ఉగ్రత్వాన్ని తగ్గించడానికి ప్రహ్లాదుడొక్కడే సమర్ధుడని తలంచి ప్రహ్లాదుని ఆదేశించగా ~ స్వామిని ఇలా స్థుతించాడు:

సీ: నీ గృహాంగణభూమి నిటలంబు మోవంగ నిత్యంబు మ్రొక్కడేని

నీ మంగళ స్తవ నికర వర్ణంబులు పలుమారు నాలుక బలుకడేని

నీ యధీనములుగా నిఖిల కృత్యంబులు ప్రియ భావమున సమర్పింపడేని

నీ పదాంబుజముల నిర్మల హృదయుడై చింతించి మక్కువ జిక్కడేని

తే: నిన్ను జెవులార వినడేని నీకు సేవ ~ సేయరాడేని బ్రహ్మంబు జెందగలడె

యోగి యైన దపోవ్రతయోగియైన ~ వేదియైన మహాతత్త్వ వేదియైన

భావము ~

దేవదేవా! నీ మందిరప్రాంగణ భూమిపై నుదుటిని మ్రోయించుచు ఆనంద పారవశ్యముతో నిత్యమూ మ్రొక్కనివాడు ~ నీ దివ్యమంగళ స్తవ వర్ణనలను పలుమార్లు నాలుకపై ఉచ్చరింపనివాడు తనయొక్క సర్వకర్మలను ప్రేమభావముతో నీకు సమర్పించి నీ ఆధీనము చేయనివాడు ~ నీ దివ్యపాదపద్మములను నిర్మల హృదయుడై స్మరించుచూ ప్రీతితో పట్టు కొననివాడు ~ నీ దివ్యచరిత్రలను చెవులారా విననివాడు ~ నీ పాదపద్మముల సేవ చేయుటకు రానివాడు ~ ఎంతటి యోగి యైననూ తపోధనుడైననూ ~ వేదవేత్తయైననూ తత్త్వవేత్త యైననూ ~ బ్రహ్మమును జెందగలడా? స్వామీ! కావున ఓ ప్రభూ! నీ యొక్క పాదసేవ ~ దాస్య ~ భాగ్యాన్ని నాకు అనుగ్రహింపుము ~ అని ప్రణతుడై ప్రహ్లాదుని వాక్కులకు మిక్కిలి
సంతసించి శ్రీహరి సౌమ్యముగా ఇట్లనెను ~
అలా ప్రహ్లాదుడు కీర్తించగా స్వామివారు చాలా సంతోషించి:

శా: సంతోషించితి నీ చరిత్రమునకున్ సద్భద్రమౌగాక నీ
    యంతర్వాంచిత లాభమెల్ల గరుణాయత్తుండనై యిచ్చెదం
    జింతం జెందకు భక్త కామదుడ నే సిద్ధంబు దుర్లోక్యుడన్

జంతుశ్రేణికి నన్ను జూచిన బునర్జన్మంబు లే దర్భకా!

బాలకా! నీ సత్చరిత్ర సత్శీలములకు సంతోషించినాను. నీకు సకల శుభాలు కలుగుగాక! నీ మనోవాంచితాలన్నింటినీ కరుణతో నీకు ప్రసాదించెదను. భక్తుల మనోభీష్టాలను తీర్చుతాను ~ నా దర్శనమే దుర్లభము ~ అయినా నా దర్శనము ఒకసారి లభించిన జీవులకు ఇక పునర్జన్మ ఉండదు. నీవు ఏదైనా వరాన్ని కోరుకో బాలకా! అని స్వామి ప్రహ్లాదుణ్ణి అడిగినాడు.

ప్రహ్లాదుడు అలా వరాలడిగేవాడు కాదుకదా! ఆ బాలుడు ~~ ప్రభూ! నన్ను పరీక్షించదలచి వరమిచ్చెదనంటివా? కోరికలు సంసారమునకు బీజములును, బంధకారకాలును కావున కామములకు భయపడి ముముక్షువునై క్షేమముకోసమే నిన్ను ఆశ్రయించినాను ~ కోరికలవలన మనశ్శరీర ధైర్యాలు, మానవ ధర్మాలు ~ లజ్జ ~ స్మృతి ~ సంపద ~ సత్యము ~ తేజస్సులు నశిస్తాయి. అందుకే నాకు ఏ కోరికలూ లేవు. ఏ వరాలూ వద్దు ~ నాకు ఎలాంటి కోరికలూ చేరకుండా వరాన్నివ్వు ~ కోరికలు లేనివాడు భగవంతునితో సమానుడను కదా! అని స్వామికి మనసారా ప్రణమిల్లినాడు ప్రహ్లాదుడు.*

అప్పుడు స్వామి ~ అయినా నేను నిన్ను అనుగ్రహించుచున్నాను ~

నీవు అసురుల ప్రభుపై కొనసాగి మన్వంతరకాలము సకల భోగాలను అనుభవిస్తావు. శుభచింతనతో నా చరిిత్రలను వింటూ నన్ను నీ ఆత్మయందు నిలుపుకుని కర్మసముదాయమును తొలగించుకుని ఈశ్వరార్పణముగా పూజలను ఆచరించు. ఆపైన కాలగమనమున* ముల్కోకాలలో యశస్సును పొంది దేహాన్ని విడిచి బంధముక్తుడవై నన్ను చేరుతావు ~ ఇదేకాక, ఏ మానవుడు ప్రియముతోడ నా అవతారగాధను ~ నీ ఉత్తమ పుణ్యచరిత్రను విని మననము చేయునో వాడు కర్మబంధమును త్రెంచుకొని ఈ లోకాన మరలా జన్మించడు~ అని దీవించినాడు స్వామివారు. అప్పుడు ప్రహ్లోదుడు ~ నా తండ్రి తన సోదరుడైన హిరణ్యాక్షుని నీవు వరాహ రూపాన సంహరించుటచే నీపట్ల శతృత్వాన్ని బూని నీవు పరమేశ్వరుడని గుర్తింపలేక నీ భక్తుడనైన నన్ను ఒక శతృవు వలె భావించి అపకారము చేయదలంచెను. కనుక నా తండ్రి చేసిన పాపపుంజాలను పోగొట్టి ఆయన పరిశుద్ధాత్ముడగునట్లు వరాన్నివ్వు స్వామీ! స్వామి ఈ వరాన్నిస్తూ ~ నీవు వైదిక విధులతో నాయందు చిత్తాన్ని నిల్పి నీ తండ్రికి అంతిమ సంస్కారాలను ప్రీతితో నెరవేర్చు. అతడు తప్పక పాపరహితుడై పుణ్యలోకాలకు పోతాడు

ఉ: శ్రీరమణీయమైన నరసింహ విహారము నింద్ర శత్రు సం
హారము బుణ్య భాగవతుడైన నిశాచర నాథ పుత్ర సం
చారము నెవ్వడైన సువిచారత విన్న బఠించినన్ శుభా
కారము తోడనే భయము గల్గని లోకము జెందు భూవరా!

మనోహరము ~ శుభప్రదము అయిన ఈ నరసింహ విహారము ఇంద్రశత్రువైన హిరణ్యకశిపుని సంహారము ~~ పరమ భాగవతుడైన ప్రహ్లాదుని సంరక్షణమునూ ఎవరైనా శ్రద్ధగా వినినా ~ పఠంచినా ~ సర్వ శుభాలతో పుణ్య
లోకాన్ని పొందుతారు ~ అని ఫలశృతి.

ప్రథమ రత్నమయిన ప్రహ్లాద చరిత్ర సమాప్తము
~ హరిః ఓం తత్ సత్

~(సేకరణ: పి. యల్. నరసింహాచార్య దాసన్)~